క్లుప్తంగా

ఓటరు జాబితా పూర్తి చేయాలి

తిరుపతి తుడా: పెండింగ్ ఓటరు జాబితా పూర్తి చేసేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు పని చేయాలని తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. తుడా రోడ్డులోని నగరపాలక సంస్థ కచ్చాపి ఆడిటోరియంలో మంగళవారం తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, అదనపు సూపర్ వైజర్లతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బీఎల్ఓల దగ్గర ఎలాంటి పెండింగులు ఉండరాదని, ఫారం–6, 7, 8 క్లెయిమ్స్ మొత్తం పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులకు తావు లేకుండా తయారు చేయాలని ఆమె సూచించారు. అదనపు అధికారులు తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఆర్వోలు కేఎల్ వర్మ, సేతు మాధవ్, డిప్యూటీ తహసీల్దార్ జీవన్, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఉడిపి పీఠాధిపతి



అమ్మవారి సేవలో ఉడిపి శ్రీపాదురు బండారుకేరి మఠాధిపతి శ్రీవిదీషతీర్థ స్వామీజీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం ఉడిపి శ్రీపాదురు బండారుకేరి మఠాధిపతి శ్రీవిదీష తీర్థ స్వామీజీ తన శిష్య బృందంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీఐ రామ్మోహన్, ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు



పారిశుధ్య కార్మికులకు సరుకుల పంపిణీ

తిరుపతి కల్చరల్: 21, 22వ వార్డుల్లో తుపాను వర్షాలతో ఇళ్లల్లో నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆ వార్డుల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు అనిల్, చంద్ర ముఖ్య అతిథులుగా హాజరై 30 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసున్నీసా బేగం, సహకరించిన రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్లను అభినందించారు.

గోమాత ఘోష



మూర్ఛవ్యాధితో కుప్పకూలిన ఆవు

చంద్రగిరి: మూడు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని ఆవు గ్రామ శివారులో మూర్ఛ వ్యాధికి గురై నరకయాతన అనుభవించింది. వానకు తడుస్తూ మృత్యువుతో పోరాటం చేసిన ఘటన మండల పరిధిలోని మంటపంపల్లిలో చోటు చేసుకుంది. మూడు రోజులుగా గ్రామ శివారులో గుర్తు తెలియని ఆవు సంచరిస్తుండేది. అయితే ఎక్కడకు వెళ్లాలో తెలియక మూడు రోజులుగా వర్షానికి తడుస్తూ గ్రామ శివార్లలోని చెట్ల మధ్య సేదతీరుతోంది. ఈ క్రమంలో వర్షానికి బాగా తడవడంతో ఆవుకు మూర్ఛ వ్యాధి వచ్చి కుప్పకూలిపోయింది. మూడు రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న ఆవును స్థానిక రైతులు గమనించి పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. మంగళవారం ఘటన స్థలానికి చేరుకున్న పశువైద్యాధికారులు ఆవుకు వైద్యసేవలను అందించడంతో మధ్యాహ్నానికి కోలుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



సబ్‌స్టేషన్‌లో ఈఈ వాసుదేవరెడ్డి

చంద్రగిరి: తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసుదేవరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం తిరుపతి రూరల్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్ సమస్యలపై 1912కు కాల్ సెంటర్ లేదా సమీప సబ్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

వరదనీరు చేరిన ఇంటిలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే





తేరుకుంటున్న తిరునగరి

- లోతట్టు ప్రాంతాల్లో యథావిధిగా జనజీవం
- నగరపాలక సంస్థ సహాయకచర్యలపై సర్వాత్రా హర్షం
- అభివృద్ధితో తప్పిన ముంపు ముప్పు

తిరుపతి తుడా: మిచాంగ్ తుపాను తిరుపతిపై విరుచుకుపడింది. తీవ్ర తుపాను కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఆధ్యాత్మిక నగరం తడిసిముద్దయింది. జోరు గాలులు బీభత్సం సృష్టించాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాలలోకి వర్షపు నీరు ఏరులై పారింది. కాలువలు పొంగి ప్రవహించాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. దీంతో ముంపు ముప్పు తప్పింది. అనేక ప్రాంతాలలో వర్షపు నీటి కాలువల విస్తరణ, నూతన రహదారులకు ఇరువైపులా కాలువల నిర్మాణంతో వర్షపు నీటిని నగరం దాటించారు. దీంతో తుపాను ప్రమాదం నుంచి తిరుపతి ప్రజలు తేరుకుంటున్నారు.

ముందస్తు చర్యలు

వాతావరణ శాఖ హెచ్చరికలతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అప్రమత్తమయ్యారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేశారు. తుపానుకు మూడు రోజుల ముందు నుంచి కపిలతీర్థం, మాలాడి గుండం నుంచి ప్రవహించే పెద్ద కాలువలలో టన్నుల కొద్ది వ్యర్థాలను తొలగించారు. నగరంలో ప్రధాన కాలువలలో చెత్త, వ్యర్థాలను తొలగించడంతో వర్షపు నీరు సాఫీగా నగరం దాటేందుకు దోహదపడింది. అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించి నిత్యం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి వసతులు కల్పించారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

మున్సిపల్ కార్పొరేషన్ యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. జోరు వానలోనూ అధికార యంత్రాంగం సహాయక చర్యలలో పాల్గొన్నది. అనేక ప్రాంతాలలో భారీ వృక్షాలు, కొమ్మలు నేలకొరిగాయి. వీటిని ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించారు. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కరెంట్ సరఫరాకు అంతరయం ఏర్పడింది. వెంటనే స్పందించిన ఆ శాఖాధికారులు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అభివృద్ధితోనే ముంపునకు చెక్

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముందు చూపుతో చేపట్టిన అభివృద్ధి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. అభివృద్ధి తన అజెండాగా భూమన అభినయ్‌రెడ్డి నగరంలో రోడ్ల అభివృద్ధి, మురుగు, పెద్ద కాలువల నిర్మాణం, రోడ్ల విస్తరణకు నడుంబిగించారు. లీలామహల్ కూడలి, కరకంబాడి రోడ్డు, ఎస్టీవీ నగర్, లక్ష్మీపురం, ఆటోనగర్, శ్రీనివాస కల్యాణ మండపం, శ్రీనివాసపురం, కొర్లగుంట తదితర ముంపు ప్రాంతాలలో కొత్తగా కాలువలను నిర్మించారు. ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో వర్షపు నీరు ఆయా ప్రాంతాలలో నిల్వ ఉండకుండా సజావుగా నగరం బయటకు ప్రవహించింది.



లక్ష్మీపురం సర్కిల్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది



భారీ వర్షాలకు నేలకొరిగిన వృక్షాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సేవా తత్పరుడు భీమాస్ రఘు

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



ఉత్తమ కళాకారుడు కేఎన్.రాజాను పురస్కారంతో సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: హోటల్ రంగంలో భీమాస్‌ను ఒక బ్రాండ్‌గా నిలిపి మంచి మనసుతో పలువురికి సాయం అందించే సేవా తత్పరుడు భీమాస్ రఘు అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. భీమాస్ హోటల్స్ అధినేత, శ్రీత్యాగరాజస్వామి ఉత్సవ కమిటీ ప్రతినిధి భీమాస్ రఘు ప్రథమ వర్ధంతి సభ మంగళవారం త్యాగరాజ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భీమాస్ రఘు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ భీమాస్ రఘు సేవా తత్వాన్ని కొనియాడారు. రఘు వర్ధంతి నాడు ఆయన కుమారులు తన తండ్రి పేరుతో విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా భీమాస్ రఘు బయోగ్రఫీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ఏడుగురిని భీమాస్ రఘు విశిష్ట సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఇందులో ఉత్తమ గాయకుడు శబరి గిరీష్ శర్మ, ఉత్తమ నృత్య కళాకారిణి వి.శశికళ, ఉత్తమ వేదిక్ పండిట్ చంద్రమౌళి, ఉత్తమ వేదిక్ విద్యార్థి సన్నిధానం వాచస్పతి శర్మ, ఉత్తమ గోసంరక్షకుడు ప్రతాప్ స్వామీజీ, ఉత్తమ సోషియల్ సర్వీస్ కె.శ్రీధర్ ఆచారి, ఉత్తమ కళాకారుడు కేఎన్.రాజా ఉన్నారు. గౌరవ అతిథి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్, భీమాస్ అశోక్, భీమాస్ బాలాజీ, కేఆర్.వెంకటాచలం, తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, తిరుపతి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి కంచి రఘురామ్, సీఆర్‌కే.శేషగిరిరావు, ప్రభాకర్, కత్తుల సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, డెప్యూటీ మేయర్‌కు ధన్యవాదాలు



తిరుపతి కల్చరల్: తుపాను ముంచుకొచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి, పారిశుధ్య కార్మికులకు 45వ వార్డు కార్పొరేటర్, స్థానిక ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు 45వ డివిజన్‌లో శివజ్యోతినగర్ వరద నీటితో నిండిపోయింది. ఈ నేపథ్యంలో డ్రైనేజీల మరమ్మతులు పెద్ద కాల్వలో బురద తీయడంతో ఈ ఏడాది తుపాను ప్రభావం ఏ మాత్రం కనిపించలేదని స్థానిక కార్పొరేటర్ అనీష్ రాయల్, వార్డు ప్రజలు తెలిపారు. ఇందుకు కారణం పూర్తిగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముందు చూపుతో తీసుకున్న చర్యలే కారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులు సైతం తమ బాధ్యతను పూర్తి స్థాయిలో చేపట్టడంతో వారికి కూడా అభినందనలు తెలిపారు.

భయం గుప్పెట్లో శివపురం

- తుడా చైర్మన్ చొరవతో తప్పిన ముప్పు
- ప్రైవేటు గోడ తొలగించి వర్షపు నీరు మళ్లింపు



పాడిపేట శివపురం వద్ద ప్రమాదకర స్థాయిలో నిలిచిన వర్షపునీరు

తిరుపతి రూరల్: పాడిపేట పంచాయతీలోని శివపురం భయం గుప్పెట్లో ఉండిపోయింది. గ్రామానికి దక్షిణం వైపు గంట గంటకు వర్షపు నీరు పెరుగుతుండడం, నీళ్లు పోకుండా ప్రైవేటు స్థలాల్లో గోడలను నిర్మించడంతో భయాందోళనలకు గురయ్యారు. వర్షపు నీరు గ్రామం పైకి వస్తుండడంతో వారు కాపాడాలని తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వేడుకున్నారు. దీంతో గ్రామాన్ని సందర్శించిన మోహిత్ రెడ్డి స్థానికులకు భరోసా కల్పించారు. గ్రామానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని మళ్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీ, రెవెన్యూ అధికారులతో పాటు ప్రైవేటు వ్యక్తులతో మాట్లాడి వర్షపు నీటిని మళ్లించేందుకు గోడను తొలగించేందుకు ఒప్పించారు. 30 అడుగుల మేర గోడను తొలగించడంతో వర్షపునీరు స్వర్ణముఖిలోకి మళ్లించారు. గ్రామస్తులకు మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనమునిరెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ రమేష్‌బాబు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రైవేటు వ్యక్తుల గోడను తొలగిస్తున్న అధికారులు

కలసికట్టుగా ఎయిడ్స్‌ను తరిమేద్దాం..



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పాకాల: కలసికట్టుగా పని చేసి ఎయిడ్స్‌ని తరిమేద్దామని చెన్నుగారిపల్లి సచివాలయం సీహెచ్‌ఓ గాయత్రి పిలుపునిచ్చారు. మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని కోర్‌పీయూ(ఎన్‌జీవోలు), సచివాలయ సిబ్బందితో కలసి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు కోర్‌పీయూ ప్రోగ్రాం మేనేజర్ సద్దాం సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎయిడ్స్ నియంత్రణకు పాటు పడాలని, నైతిక విలువలు కలిగి జీవించినప్పుడే ఎయిడ్స్‌ను నివారించవచ్చని సూచించారు. ఎడ్యుకేటర్ బాలాజీ, పంచాయతీ కార్యదర్శి ఎస్.రూప, మహిళా పోలీస్ లీలావతి, సంఘమిత్ర కోమల, ఆశావర్కర్ రేవతి, స్థానికులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న తలకోన జలపాతం



తలకోన జలపాతం (శిరోద్రోణం)

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం తలకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. సోమవారం తలకోన జలపాతం దృశ్యాలు చూడడానికి పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు. తలకోన అటవీ ప్రాంతంలో వర్షాలు పడడంతో శిరోద్రోణం జలపాతం కింద కనీసం నిలబడలేని పరిస్థితి. నెలకోనలోని జలపాతం మడుగు నిండి పొర్లుతోంది. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అటవీ శాఖ అధికారులు సందర్శకులను జలపాతం వద్దకు అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు.



ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పాకాల పంచాయతీలో పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాకాల: పెళ్లి చేసుకోబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో పెళ్లి కానుకను అందజేశారు. మంగళవారం ఈ కానుకలను వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. గానుగపెంట పంచాయతీ దనూజవారిపల్లి గ్రామంలో ఒక్కటి కాబోతున్న వెంకటేష్, దివ్య, పాకాల పంచాయతీ సచివాలయం–2 పరిధిలోని గాంధీనగర్‌లో ఒక్కటి కాబోతున్న దంపతులు వాసంతి, వెంకటశ్రీనివాస్, గాదంకి పంచాయతీ గుంత గాదంకి గ్రామంలో ఈశ్వర్‌ప్రసాద్, స్వర్ణప్రియలకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, పట్టు వస్త్రాలు, తిరుమల శ్రీవారిప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బీసీ సెల్ అధ్యక్షుడు మధు, యతీశ్వర్‌రెడ్డి, నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు జి.సురేష్, వెంకటరమణారెడ్డి, వెంకటరామారెడ్డి, జకయశంకర్, సుధాకర్, కాముడు, మురళీకృష్ణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మిచాంగ్ బీభత్సం





చంద్రగిరి పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చంద్రగిరి: మిచాంగ్ తుపానుతో మూడు రోజులుగా మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా గాలీవాన బీభత్సం సృష్టించింది. ఫలితంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రామచంద్రాపురం మండలంలోని కూనేపల్లిలో 11కేవీ విద్యుత్ లైన్ కుప్పకూలింది. అదే విధంగా చంద్రగిరి మండలంలో పలు చోట్ల 15కేవీ, 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఏడీఈ శేషారెడ్డి ఆధ్వర్యంలో ఏఈలు నాగరాజు, హరిప్రసాద్ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.

నీట మునిగిన చామంతి పంట

మండలంలోని మంటపంపల్లి గ్రామానికి చెందిన కామసాని నాథమునిడ్డి రెండు ఎకరాలలో చామంతి పంట సాగు చేస్తున్నారు. సోమవారం రాత్రి గాలీవాన బీభత్సానికి పంట నీట మునగడంతో పాటు 10వేల చామంతి మొక్కలు నేలకొరిగాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, ఉద్యానవనశాఖ, సచివాలయ అధికారులు పంటను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని రైతుకు భరోసా కల్పించారు.



చామంతి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నేలను బాధ్యతగా పరిరక్షించుకోవాలి



కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ ప్రకాష్

తిరుపతి ఎడ్యుకేషన్: మానవాళికి ఆహారం అందిస్తున్న నేలను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు తెలిపారు. ప్రపంచ మృత్తికా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అధ్యాపకులు పి.ప్రియవర్ధన్ బాబు, వై.గంగాధర్‌రావు, కె.కృష్ణకిశోర్, పి.రవి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో...

తిరుపతి సిటీ: శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల అసోసియేట్ డీన్ బహుమతులను అందజేశారు. డాక్టర్ జీపీ లీలావతి, డాక్టర్ ఎంవీ రమణ, డాక్టర్ మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లెల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు





మల్లంగుంటలో వీధుల్లో వర్షపు నీటి తొలగింపు, వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో అతలాకుతలమైన పల్లెలు క్రమంగా తేరుకుంటున్నాయి. తుపాను తీరం దాటడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. కాలువలు, వీధుల్లో నీళ్లు నిలిచిపోవడంతో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. అంటువ్యాధులు ప్రబలకుండా వీధులను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు. వర్షపు నీరు ట్యాంకులు, కుళాయిల్లో నిలిచిపోయి కలుషితం కావడంతో మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు. ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రయ్య, కార్యదర్శి రమేష్, అధికారులు పాల్గొన్నారు.



వేదాంతపురంలో ఇంటింటికి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్ జనార్దన్‌యాదవ్

నాదనీరాజనంపై అయోధ్యకాండ పారాయణం

తిరుమల: తెల్లని పొగమంచు తెరల నడుమ, శేషగిరులే హిమగిరులను తలపిస్తున్నాయి. ఈ తరుణంలో లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు 5వ విడత అయోధ్య కాండ అఖండ పారాయణంతో తిరుమలగిరులు మార్మోగాయి. 14 నుండి 17వ సర్గల వరకు గల 186 శ్లోకాలను పారాయణం చేశారు. వేద పండితులు అఖండ పారాయణం చేయగా పలువురు భక్తులు భక్తిభావంతో వారిని అనుసరించి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద విజ్ఞానపీఠానికి చెందిన ప్రముఖ పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన నామ సంకీర్తన చివరిలో ఆలపించారు.

వెటర్నరీ వర్సిటీతో కలసి పనిచేస్తాం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీతో పరిశోధన అంశాలపై స్విమ్స్ కలసి పనిచేస్తుందని డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో పశు శరీర నిర్మాణ శాస్త్రంపై ప్రారంభమైన మూడు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మానవ సంరక్షణలో భాగంగా తయారు చేసే పరిశోధక మెడిసిన్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు వెటర్నరీ కళాశాల సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. మొదటి రోజు సదస్సులో గ్రాస్ అనాటమీ, అనాటమీ ఆఫ్ జూ అండ్ వైల్డ్ ఆనిమల్స్ అంశాలపై సదస్సులో చర్చించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కే వీరబ్రహ్మయ్య, పుదుచ్చేరి పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ తాండవమూర్తి, శాస్త్రవేత్తలు హాజరయ్యారు.